క్లుప్తంగా

అన్నదానం



నగరి: పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కర కంఠేశ్వర ఆలయంలో శనివారం అయ్యప్ప భక్తులు అన్నదానం చేశారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులు శనివారం ఆలయంలోని అయ్యప్ప స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అనంతరం భక్తులకు అన్న దానం చేపట్టారు.

'ధరణి'ని సద్వినియోగం చేసుకోండి

వెదురుకుప్పం/గంగాధర నెల్లూరు: ధరణీ డిపాజిట్ పథకం ద్వారా ఖాతాదారులకు అధిక వడ్డీ చెల్లిస్తున్నట్లు పచ్చికాపల్లం డీసీసీబీ బ్యాంకు మేనేజర్ ఉషామాధవి, గంగాధరనెల్లూరు డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ మహేష్ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో 16 నుంచి 31 వరకు ధరణి డిపాజిట్ పథకం కొనసాగుతుందన్నారు. తద్వారా డిపాజిటర్లకు 8 శాతం వడ్డీ చెల్లిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా సీనియర్ సిటిజన్లకు 8.5 శాతం వడ్డీ చెల్లిస్తామన్నారు. ఈ పథకంలో కనిష్ట డిపాజిట్ రూ.1000 పైబడి స్వీకరిస్తున్నట్లు చెప్పారు. డిపాజిట్ చేసుకున్న ఖాతాదారులకు డీఐసీజీసీ ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నగదును పొదుపు చేసుకుని ఇతర వాణిజ్య బ్యాంకుల కంటే అధిక వడ్డీలను పొందాలన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు పచ్చికాపల్లం బ్యాంకులో నేరుగా, లేదా 9100127753 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఈదువారిపల్లిలో వైద్యశిబిరం

కార్వేటినగరం: మండల పరిధిలోని ఈదువారి పల్లిలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించినట్లు వైద్యాధికారి డాక్టర్ యూసఫ్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇంటి ఆవరణల్లో వర్షపు నీరు నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు వంటి వ్యర్థాలు ఇంటి ఆవరణల్లో ఉండడం వల్ల వర్షపు నీరు చేరి దోమలు, లార్వాలు పెరిగి విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచి, వర్షపు నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్, మలాథిన్ వంటి ద్రావణాలను పిచికారీ చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి మోహన్, పబ్లిక్ హెల్త్ ఏఎన్ఎం గౌరి, వైద్య ఆరోగ్య సిబ్బంది త్యాగ, అంబరీష్‌రాజు, హిదయ్‌తుల్లా పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీనివాసుడి చిద్విలాసం



తిరుచ్చిపై దర్శనమిస్తున్న శ్రీవారు

పుత్తూరు రూరల్: శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం అప్పలాయగుంటలో వెలసిన స్వామివారి ఆలయంలో శ్రీవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవతో శ్రీనివాస స్వామిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులు ఇచ్చారు.

పుష్ప వాహనంపై కరివరదరాజ స్వామి



వాహన సేవలో పాల్గొన్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి: మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో టీటీడీ పరిధిలో ఉన్న కరివరదరాజ రాజ స్వామి ఆలయంలో శనివారం రాత్రి పుష్ప వాహనసేవ వైభవంగా జరిగింది. పెరటాసి నెల శనివారాన్ని పురస్కరించుకుని చేపట్టిన ప్రత్యేక పూజల్లో భాగంగా కరివరదరాజ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పుష్పవాహనంలో పురవీధుల్లో ఊరేగించారు. ఏటా వైభవంగా జరిగే ఈ ఉత్సవాల్లో మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ పండితులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వేదమంత్రాలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, నాయకులు జగన్, అయ్యప్ప, అరుణాచలం, కన్నాయిరం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వడమాలపేట విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

పుత్తూరు రూరల్: రాష్ట్రస్థాయి జూడో పోటీలకు వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. పాఠశాలలో క్రీడాకారుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన జిల్లాస్థాయి జూడో పోటీల్లో వడమాలపేట క్రీడాకారులు మంచి ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. అండర్–14 బాలికల విభాగంలో లీల 23 కేజీల విభాగంలో, ప్రియదర్శిని 36 కిలోలు, భవిత 40 కిలోలు, యశ్వంతి 44 కేజీల పోటీల్లో ప్రథమ స్థానాలు సాధించినట్లు చెప్పారు. అండర్–17 బాలికల విభాగంలో సాహితి 44 కేజీల విభాగంలో తొలి స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో దేవాహర్ష 25 కేజీలు, అనస్ 35 కేజీలు, శ్రావణ్‌కుమార్ 50 కేజీలు, అండర్–17 విభాగంలో మన్సూర్ అలం 66 కేజీలు, ధనుష్‌కుమార్ 90 కేజీల విభాగంలో ప్రథమ స్థానాలను కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి 30 వరకు అనంతపురం జిల్లా చిగిచెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో వీరు పాల్గొంటారని వెల్లడించారు. హెచ్‌ఎం కరుణానవనీతం మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ మంచి ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



విద్యుత్ దీపాలంకరణలో ఆరేటమ్మ ఆలయం



ద్రౌపదీదేవి ఆలయం

పుత్తూరు రూరల్: పట్టణంలోని ఆరేటమ్మ, ద్రౌపదమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాలు దసరా ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాల్లో తొమ్మిది రోజుల పాటు అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. ప్రతి రోజూ ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు, ఊరేగింపు నిర్వహిస్తారు. గ్రామ దేవతగా పూజలందుకుంటున్న ఆరేటమ్మ ఆదివారం కామాక్షీదేవీ అలంకరణలో దర్శనం ఇవ్వనున్నారు. సోమవారం మహిషాసుర మర్ధిని, మంగళవారం దుర్గాదేవి, బుధవారం మీనాక్షీదేవి గురువారం అన్నపూర్ణాదేవి, శుక్రవారం లక్ష్మీదేవి, శనివారం సరస్వతీదేవి, ఆదివారం రాజరాజేశ్వరిదేవి, సోమవారం ఆరేటమ్మతల్లి అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. అదేరోజు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డి తెలిపారు. నవరాత్రి వేడుకల్లో పెద్దసంఖ్యలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని అన్ని అమ్మవారి ఆలయాలు విద్యుత్ దీపకాంతులతో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి.

పాలసముద్రం: మండలంలోని కేజే పురం పంచాయతీ బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మతల్లి ఆలయంలో, మిద్దినత్తం గ్రామంలో వెలసిన పడవేటమ్మతల్లి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి జరుగుతాయని గ్రామస్తులు శనివారం తెలిపారు. ప్రతి రోజు అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించి అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఆఖరిరోజు అమ్మవార్లకు 101 బిందెల పాలు, పసుపు నీరు, బెంగళూరు నుంచి 101 రకాల వివిధ సుగంధ పుష్పాలతో పల్లకిలో అలంకరించి ఊంజల్ సేవ నిర్వహిస్తామని తెలిపారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

గంగాధర నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని అల్లియల్లమ్మ అమ్మవారి దేవస్థానంలో సోమవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు రవీంద్ర రెడ్డి, పార్థసారథి రెడ్డి, గుణశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అమ్మవారికి ప్రతిరోజు ఉదయం ప్రత్యేక అభిషేకం చేసి, సాయంత్రం విశేష అలంకరణతో నాలుగు మాడవీధుల్లో పల్లకిసేవ జరుగుతుందన్నారు. 24వ తేదీ విజయ దశమి సందర్భంగా సాయంత్రం అమ్మవారిని మహిషాసురమర్ధిని అలంకరణలో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

కలికిరి కొండలో ప్రత్యేక పూజలు

పెనుమూరు(కార్వేటినగరం): నాలుగో శనివారాన్ని పురస్కరించుకుని కలికిరి కొండలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తిరువళ్ల శనివారాల్లో భాగంగా నాలుగో శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి నేతి దీపాలు వెలిగించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. టీటీడీ సిబ్బంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేపట్టారు.

గోవిందమాల భక్తులకు అన్నదానం



అంజేరమ్మ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలంలోని అంజేరమ్మ ఆలయం వద్ద శ్రీవారి దర్శనార్థం కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తులకు శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పుత్తూరు పట్టణానికి చెందిన జి.జయచంద్ర, టి.మునస్వామి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఏటా పెరటాసి నెలలో వచ్చే శనివారం రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం రాయల మండపంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి తన సొంత నిధులతో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణను శనివారం పరిశీలించారు. అక్కడి భక్తులతో మాట్లాడి వసతులను అడిగి తెలుసుకున్నారు.

నేడు అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీరంగరాజపురం: దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన ఆరిమాని గంగమ్మకు ప్రభుత్వం తరపున ఆదివారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి పట్టువస్త్రాలను సమర్పించనున్నట్లు జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు పార్లమెంట్ సభ్యులు రెడ్డెప్ప, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు, నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.